క్లుప్తంగా

6న రెండు కార్ల వేలం

సీతానగరం: మండల కేంద్రంలోని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఆవరణలో సెప్టెంబర్ 6వ తేదీన ఇండికా, స్కార్పియోలను పార్వతీపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఆసక్తి గల వారు వివరాల కోసం సీతానగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులతో లక్ష్మీ నృసింహస్వామికి అభిషేకాలు చేయిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినదీ తీరాన కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు స్వామివారిని ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాల పూలు, పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ఉదయం 6 గంటలకే ఆలయానికి పూజాసామగ్రితో చేరుకున్న భక్తులతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు.

వేద గణితంతో చిట్కాలు



స్కూల్ కాంప్లెక్స్‌లో సూచనలు ఇస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: వేదగణితంతో పాఠశాల విద్యార్థులకు మంచి చిట్కాలు నేర్పించవచ్చని ఎంఈఓ సామల సింహాచలం అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు లెక్కలు బోధించేటప్పుడు వేదగణితానికి సంబంధించిన చిట్కాలను తెలియపరచాలని, వాటివల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు. మేధస్సు పెరుగుతుందని, లెక్కల సబ్జెక్టుకు సంబంధించి వారికి మంచి తర్ఫీదు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


తుప్పల తొలగింపు



రోడ్డు పక్కన తుప్పలు, డొంకలు తొలగింప చేస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

బలిజిపేట: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు మలుపుల వద్ద ఉండే తుప్పలు, డొంకలను ఎస్సై ప్రశాంత్‌కుమార్ గురువారం తొలగింపజేశారు. ఈ మేరకు మండలంలోని వెంగాపురం నుంచి బర్లి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే తుప్పలు, డొంకలను తొలగించారు. ముఖ్యంగా మలుపుల వద్ద గుబురుగా పెరిగే తుప్పలు, డొంకల వల్ల వచ్చిపోయే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున తొలగిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు మలుపుల వద్ద తక్కువ స్పీడ్‌తో రావడం మంచిదని హితవు పలికారు. వాహనాలపై వచ్చే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

కల్లికోటకు బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్ కనకదుర్గకు వినతిపత్రం అందజేస్తున్న వాకాడ ఇందిర

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం కల్లికోట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వాకాడ ఇందిర కోరారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు స్పందించి గ్రామానికి ఉదయం ఒక ట్రిప్పు సాయంత్రం ఒక ట్రిప్పు బస్సు వేసి విద్యార్థులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వేడుకగా రక్షాబంధన్

సీతానగరం: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బాంధవ్యానికి ప్రతీకగా వారి మధ్య ఉన్న ఆప్యాయతానురాగాలకు తీపిగుర్తుగా ఒకరికొకరు మేలు, రక్షణ ఆకాక్షించే రక్షా బంధన్ కార్యక్రమం గురువారం మండలంలోని వాడవాడలా వేడుకగా జరిగింది. ఈ మేరకు రక్షా బంధన్ సంబరాలను చినభోగిలి, సీతానగరం గ్రామాల్లో అన్నలకు చెల్లెళ్లు, అక్కలతో తమ్ముళ్లు రాఖీలు కట్టించుకుని దీవెనలు, బహుమతులు అంది పుచ్చుకున్నారు.



సీతానగరం: చెల్లెలితో రాఖీ కట్టించుకుంటున్న అన్నయ్య

రక్షాబంధన్ పవిత్రబంధం

బలిజిపేట: రక్షా బంధన్‌ను పవిత్ర బంధంగా చెప్పుకుంటున్నాం. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ఇది మచ్చుతునక. సొంతవారు కాకపోయినా తోబుట్టువుల్లా భావించే వారిమధ్య రక్షా బంధనం ఎంతో పవిత్రంగా ఉంటుంది. రాఖీ ఉత్సవాన్ని మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. అందులో భాగంగా మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరామ్‌కు ఎంపీపీ నాగమణి రాఖీ కట్టి తన ఆత్మీయతను చాటుకున్నారు.



చినభోగిలిలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లి



బలిజిపేట: మండల ఉపాధ్యక్షుడికి రాఖీ కడుతున్న ఎంపీపీ నాగమణి

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ



బుద్దిపేటలో వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని చినభోగిలి, బుద్దిపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబసభ్యుల అకాల మరణం కారణంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. విజయవాడలో అత్యవసర సమావేశానికి తాను వెళ్లవలసి వచ్చిందని, పార్టీ కార్యకర్తల ఇళ్లలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా విధిగా పాల్గొంటానన్నారు. చినభోగిలి ఉపసర్పంచ్ తండ్రి, పెదభోగిలి మేజర్ పంచాయతీ సభ్యుడు ఎస్.వెంకటరమణ తల్లి ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన పరామర్శించారు. అంతకు ముందు గాదెలవలసలో సోషల్‌మీడియా ప్రతినిధి బొన్నాడ విశ్వకుమార్ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం మండలాల నాయకులు బి.నాగేశ్వరరావు, బి.రమేష్ , ఎస్.కిరణ్‌కుమార్ బి.సూర్యనారాయణ, ఆర్వీ పార్థసారథి, ఎస్.రమేష్, పి రామారావు, కె.శ్రీనివాసరావు గంట రమేష్, శాస్త్రి, పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు. పలుగ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



రూ.50వేల ఆర్థిక సహాయం చేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ చింతమానుగూడ గిరిజన గ్రామానికి చెందిన మండంగి సోనియాకు ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ గురువారం ఆర్థిక సహాయం చేశారు. సోనియాకు కాకినాడలోని రంగరాయ కాలేజీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు వచ్చిన సందర్భంగా ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. ఆమె తండ్రి తాపీ మేస్త్రీ. ఈ మట్టిలో మాణిక్యం చదువు కోసం ఐటీడీఏ డీడీ శ్రీనివాసరావు పీఓ దృష్టిలో పెట్టారు.

సంతోషిమాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు



తీరువీధులో సంతోషిమాత ఉత్సవ మూర్తి ఊరేగింపు

భామిని: సరిహద్దు మాతగా పూజలందుకొంటున్న బత్తిలి సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని గురువారం తిరువీధి నిర్వహించారు. ఇటీవల తయారు చేయించిన మకర తోరణం అలంకరించి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రావణ పౌర్ణమి రక్షాబంధన్ నాడు సంతోషిమాత జన్మదినంగా భావించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అటవీ భూమిని పరిరక్షించండి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలక అవినాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ డిమాండ్ చేశారు. ఎల్విన్‌పేట, జేకే పాడు, ఎస్‌కే పాడు గ్రామాలకు చెందిన గిరిజనులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వీరు మద్దతుగా పాల్గొన్నారు. ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలోని భద్రగిరి గురుకుల బాలుర కళాశాల సమీపంలోని ప్రభుత్వ అటవీ భూములను 1995లో వన సంరక్షణ సమితిలో సభ్యులైన జేకే పాడు, ఎస్‌కే పాడు గ్రామాలకు చెందిన గిరిజనులకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామంటూ సీపీఐ నాయకులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గిరిజనులను రెచ్చగొట్టి ఆక్రమించుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారని, ఆ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో రెవెన్యూ అధికారులు స్పందించి ఎల్విన్‌పేట పంచాయతీలోని నిరుపేద గిరిజనులకు ఆ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల నిరసన

సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొండ: నగర పంచాయతీలోని నక్కలపేట నుంచి సాయినగర్‌కు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు వేసేందుకు రూ.7లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం నగర పంచాయతీ వైస్‌చైర్మన్ రౌతు హనుమంతురావు ఆధ్వర్యంలో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి స్థానికుల రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వారం రోజుల్లో రహదారి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌చైర్మన్ తదితరులు

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధ్యయనం

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏ మేరకు గిరిజనులకు ఉపయోగపడుతున్నాయనేది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం గురువారం అధ్యయనం చేసింది. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు వంటి పథకాలు తమకు వస్తున్నాయని గిరిజనులు తెలిపారు. ఆయా పథకాల ద్వారా మంచి జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తాన్ని సందర్శించి సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు.

సంతాపం

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయం కన్వీనర్, సీహెచ్‌సీ గ్రూప్ కన్వీనర్ సవిరిగాన చంద్రశేఖర్ (42) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. వైఎస్సార్ సీపీకి గ్రామంలో కీలకంగా వ్యవహరించిన చంద్రశేఖర్ మరణించడంతో గ్రామంలో విషాదం అలముకుంది. రెండు రోజుల క్రితం చంద్రశేఖర్ గుండెపోటు రావడంతో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో మరో మారు గుండెపోటు వచ్చి మరణించినట్లు వైద్యులు గుర్తించారు. గురువారం ఉదయం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లతో పాటు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు.

రహదారి నిబంధనలపై అవగాహన అవసరం

గుమ్మలక్ష్మీపురం:

రహదారి భద్రతపై విద్యార్థులంతా అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన రోడ్ సేఫ్టీ ఆఫీసర్ నారాయణరావుతో కలిసి రహదారి భద్రతపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఉండాల్సిన రికార్డులు గూర్చి, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ధరించడం, వేగ పరిమితులను పాటించడం, వేగ నియంత్రణ ప్రదేశాల్లో వాహన వేగాన్ని నియంత్రిండం, అతివేగం వల్ల కలిగే అనర్థాలు, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్‌ఐ ఎస్.షన్ముఖరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు ఎం.సీతన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన



ఆకట్టుకున్న వర్ణచిత్రం

రాఖీ పౌర్ణమి సందర్భంగా విశ్వవిజేత అలెగ్జాండర్‌కు రాఖీకట్టి తన భర్తను, రాజ్యాన్ని రక్షించుకున్న సాధ్విలలామ పురుషోత్తముని ఉత్తమ ఇల్లాలు వర్ణచిత్రం పలువురిని ఆకట్టుకుంది. మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిసినాయుడు రాఖీపౌర్ణమి సందర్భంగా వేసిన ఈ చిత్రం పలువురిని ఆకర్షించింది.

\- గరుగుబిల్లి

కాంప్లెక్స్ సమావేశాల్లో గ్రూప్ చర్చలు జరగాలి



కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాఠశాలల బలోపేతానికి గ్రూప్ చర్చలు జరగాలని ఎంఈఓ ఆర్.ఆనందరావు సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జరిగిన ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎఫ్‌ఏ-1 పరీక్షలపై విశ్లేషణ, అసెస్మెంట్, క్వశ్చన్ ఫార్మేట్స్, టీచ్ టూల్, ఎఫ్‌ఎల్‌ఎన్, సోషల్ ఆడిట్, లైబ్రరీ బుక్స్, కాలసిద్ధి తదితర విషయాలను చర్చించాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ బి.సాంబర, సెక్రటరీ కె.విజయకుమార్, డీఆర్‌పీ మజ్జి పైడిరాజు, సీఆర్‌పీ కె.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

సీతానగరం: మండలంలోని ప్రజలకు సంబంధించి ఉన్నతాధికారుల ద్వారా వచ్చిన స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్, మండలంలోని వివిధ కార్యాలయాలనుంచి వచ్చిన స్పందన దరఖాస్తులపై ఆయాశాఖల అధికారులతో చర్చించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సూరంపేట రైతులు భూమిసమస్యను పరిష్కరించాలని స్పందనలో దరఖాస్తు చేసినట్లు తెలియజేశారు. ఈ మేరకు ఆర్‌ఐ ఎస్ శ్రీనివాసరావు వీఆర్వో, సచివాలయ సర్వేయర్‌లు ఆ భూమిని భౌతికంగా, రికార్డుల ఆధారంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



సూరంపేటలో పొలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, సర్వేయర్ శంకరరావు

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం



గుచ్చిమిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత



అరసాడలో జాబితాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు

సీతానగరం: తప్పులు లేని ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా ఓటరు నమోదు అధికారి పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కె.హేమలత చెప్పారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలం గుచ్చిమిలోని 108, 109 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గురువారం బూత్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఓటరు తొలగింపు, ప్రక్రియ, వివరాలను తెలియజేయడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధుల సూచనలమేరకు బూత్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించి తొలగింపు వివరాలు వెల్లడించాలని బీఎల్‌ఓలను ఆదేశించినట్లు చెప్పారు. తొలగించిన ఓట్లపై ఎటువంటి సందేహాలున్నా వెంటనే తెలియజేయాలని కోరారు.

అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలి

బలిజిపేట: గ్రామాల్లో బీఎల్‌ఓలు సర్వే చేసి తొలగించిన ఓటర్ల జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే తెలియచేయాలని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో రాజకీయ నాయకులు, బీఎల్‌ఓలతో గురువారం సమావేశాలు నిర్వహించారు. అందులో భాగంగా పదమాయవలస గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలగింపులు, చనిపోయినవారు, శాశ్వతంగా వెళ్లిపోయినవారు ఉంటే ఓట్లను తొలగించామని, వాటిపై ఎటువంటి అభ్యంతరాలున్నా వెంటనే తెలియచేయాలని కోరారు. అలాగే చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, బీఎల్‌ఓలు, ప్రజలు పాల్గొన్నారు.

పెదపెంకిలో ఆదిభట్ల జయంతి

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో రెండవ నంబర్ పాఠశాలలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పిన్నవయస్సులో కావ్యసంబంధిత పాఠాలను వల్లె వేయడం, హరికథాగానాన్ని ఆలపించి హరికథా పితామహుడిగా పేరుగాంచడం ఆయన గొప్పతనమని సంజీవనాయుడు కొనియాడారు. ఆయన చెప్పిన హరికథలు అంబరీషోపాఖ్యానం, జానకీ శపథం, యదార్థ రామాయణం, సావిత్రి చరిత్ర, సీతాకల్యాణం మంచి పేరుప్రతిష్టలు తీసుకువచ్చాయన్నారు. ఆయన గొప్పతనంతో తెలుగువాడికి ప్రపంచంలో కీర్తి లభించిందన్నారు. జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన మహనీయుడని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.తిరుపతిరావు, జగదీశ్వరరావు, ఎం.రాంబాయమ్మ, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆదిభట్ల చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

డిప్యూటీ సీఎంకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్

సాలూరు: రాఖీపూర్ణిమ నేపథ్యంలో గురువారం పట్టణం, మండలంలో రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరకు బ్రహ్మకుమారీస్, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు రాఖీలు కట్టారు.



సాలూరు: ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



మక్కువ: కవిరిపల్లిలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

తేజేశ్వరరావుకు సన్మానం

పాలకొండ: వైద్య రంగంలో పరిశోధనా వ్యాసాలు రాసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో నిలిచిన పాలకొండకు చెందిన ఊణ్ణ తేజేశ్వరరావుకు గురువారం ఘన సన్మానం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మథరావు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు తేజేశ్వరరావుకు సన్మానించారు. గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించి పాలకొండ ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. తేజేశ్వరరావు తల్లితండ్రులు నర్సింగరావు. గౌరీలను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నాయకులు కడగల రమణ, కిల్లారి మోహన్, బాసూరు కాంతారావు, ఆకుల కుమార్, టీకి రామకృష్ణ, కోడెం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తేజేశ్వరరావును సన్మానిస్తున్న కౌన్సిలర్లు